# 30. అభిమాని

సీతను నేను మొదటి నుంచీ ఏవగించు కునేవాణ్ని. ఆమె రూపసి కానంత మాత్రాన కాదు. ఎందుకంటే సౌందర్యం లేని వాళ్ళందర్నీ మనం అసహ్యించు కోవటం లేదు. నిజానికి సీత కన్న ఎంతో అందవిహీనురాలైన సుశీల అంటే నా కెంతో ఇష్టం.

పోతే నేను చెప్పదగ్గ కారణం ఒక్కటే! సీత ఎప్పుడూ లలితను అంటి పెట్టుకొనే ఉండేది. వాళ్ళిద్దరి స్నేహమూ అలాటిది! నాకు సీతంటే ఎంత అయిష్టమో – లలితకు అంత ఇష్టమై ఉండొచ్చు. ఐతే లలిత అంటే నాకు విపరీతమైన ఇష్టమే కాదు. అభిమానమూ, ప్రేమ మొదలైన విశేషణాలకు నేను ఆమెపట్ల ఒప్పుకు తీరుతాను. లలిత సీతను ఎంతగా అభిమానిస్తున్నా – లలిత మీద నాకు మక్కువ తరగ లేదు. నేను అసహ్యించుకునే మనిషినే జేరనిస్తున్నదన్న రహస్యంకూడా నా మీద పని చేయలేదు. విరుద్ధభావాలు కూడా కలయికకు కారణభూత మౌతయ్యేమో?

మా ఇంటి, పక్క ఇంటి భాగాల్లో వీరిద్దరి నివాసమూను. తరుచు మా ఇంటికి వొచ్చిపోతూ ఉండే వాళ్ళు. మా ఆవిడకూ వాళ్లకూ ఎంతో స్నేహం. నేను రెండు సంవత్సరాల నుంచీ లలితతో మాట్లాడాలనీ, అష్ట కష్టాలూ పడైనా సరే లలితను అనుభవించాలనీ, విశ్వప్రయత్నాలు చేయసాగాను. కాని యీ సీత ఓ పీతల్లే పట్టుకొని వొదలదాయె! లలిత నాకు ఏకాంతంగా ఎప్పుడూ ఎదురవలేదు. రోజు రోజుకూ సీత మీద నా కోపం మిన్ను ముట్టసాగింది. ఐతే నేను ఆమెను ఏం చేయగలను? లలిత నన్నడిగి అప్పు డప్పుడు తెలుగు పుస్తకాలు తీసుకునేది కాని– సీత స్నేహం వొదిలెయ్యమని లలితతో చెప్ప గలిగేటంత పరిచయాన్ని వెధవ తెలుగు పుస్తకాలు సృష్టించ లేవనే సత్యం మీకందరికీ తెలిసిందే! పోనీ సీతను కొన్నాళ్లపాటు వొదిలి

పొమ్మందామా అంటే- ఆమె అంటేనే నాకు చిరాకుగా ఉంటే- ఆమెతో మాట్లాడటం కన్న తలకాయ నెప్పి వ్యవహారం మరి ఉండదు. బతిమాలటం కన్న ఆత్మహత్య ఎన్నుకో దగ్గది!

కాలం దొర్లిపోతూనే వుంది. చూస్తూ చూస్తూండగానే లలిత వివాహం జరిగిపోయింది. నా హృదయంలో మానని గాయాన్ని చేసి లలిత అత్తవారింటికి కూడా వెళ్లిపోయింది. సీత మాత్రం పీఠ మేసుకొని ఇప్పట్లో కదలనన్నట్టు పుట్టింటిలోనే ఉంది. అత్తవారిల్లు ఆమె కింకా ఏర్పడ లేదు. లలితను నాకు చిక్కకుండా చేసింది సీత. ఇదివరకు సీతతో వున్న లలితను చూసేందుకైనా ఎంతో తహతహ పడేవాణ్ని. ఇప్పుడు వొట్టి సీతను చూడటమంటే ప్రాణాంతకంగా కూడా వుంది. 'లలిత' కు సిటీ పోలీస్ ఎస్కార్టల్లే ఉండి నాకు అన్యాయం చేసిన సీత మీద యీ జీవితంలో నాకున్న కసి తీరదు.

కాలం సాగిన కొద్దీ నేను గ్రహించిన దేమిటంటే సీత నాకోసం తహతహ పడుతోందని. ఆమె చేష్టలూ, మా ఆవిడతో మాట్లాడే సందర్భంలో ఆమె ఉపయోగించే శ్లేషా- అన్నిటినీ మించి మా కుర్రాణ్ణి పొగడటమూ మొదలైన వన్నీ నేనీ నిశ్చయానికి వొచ్చేందుకు తోడ్పడ్డవి. ఐతే ఆమె అంటేనే నాకు కసి - అలాటి జీవి నా వెంట పడ్డందుకు నా దురదృష్టాన్ని నిందించుకోవలసి వొచ్చింది. ఒకందుకు తృప్తి కూడా లేక పోలేదు. నేను ఆమెను ఆకర్షించాననేది కాచి వడబోసిన సత్యం. ఐతే నేను మాత్రం ఆమెకేమీ అవకాశం ఇవ్వను. అంటే లలిత విషయంలో నాకు కలిగించిన ఇబ్బందీ, డిసప్పాయింట్‌మెంటూ- ఆమె విషయంలో నేను కల్పించ గలను. నేనామె ప్రేమను కాలితో తన్నేస్తాను. ఆమె బాధపడుతుంది; అప్పుడు ప్రేమికుల బాధ అంటే ఏమిటో అర్థమౌతుంది. నాకు కొంచెం మనశ్శాంతి కూడా ఏర్పడుతుంది.

పైన చెప్పినవన్నీ మానవ మనస్తత్వానికి సంబంధించినవి కనుక అక్షరాలా నిజమైనవి. నన్ను చూసినప్పుడల్లా ఆమెకు కలిగే మనోవేదనను - ఆమె ముఖంలో స్పష్టంగా నేను చూసేవాణ్ణి. నా జీవితమే ధన్యమైందనే తృప్తి నాకు కలిగేది.

## 2

మా ఆవిడ రెండో కాన్పుకు వెళ్లింది మొదలూ ఇంట్లో ఒక్కణ్నే వాసాలు లెక్కిస్తూ ఏమీ తోచక తన్ను కుంటుండే వాణ్ణి. రోజొక యుగంగా గడవవలసి వొచ్చింది. రోజులు గడుస్తూన్న కొద్దీ జీవితంలో నిర్లక్ష్యతా, విసుగూ ఎక్కువైనవి.

ఏమిటా యీ మార్పని ఆలోచించాను. పగలు స్నేహితులతోనూ, క్లబ్బులతోనూ, తిరుగుళ్లతోనూ ఎలాగో కాలం గడిచేది. కాని రాత్రిళ్లు కావాలని ఎంత ఆలస్యంగా వొచ్చినా నిద్రపట్టేది గాదు. పక్కలో కనీసం రెండు గంటలన్నా అటూ ఇటూ పొర్లుతూనే

ఉండాలి. అవయవాలు ఎంత అలసట జెందినా ఆ నిద్రమాత్రం నా జోలికి వొచ్చేది కాదు. కనీసం చెత్త సాహిత్య పఠనం ప్రారంభించినా, విసుగెత్తి నిద్ర వొస్తుందేమో నని కూడా చూశాను. లేదు. లాభంలేదు. అసలు చదివేదేదో అర్థం కాకపోతుంటే చెత్తసాహిత్యానికీ, ఉత్తమ సాహిత్యానికీ భేదం ఎలా తెలుస్తుంది?

ఈ అశాంతి ఎక్కడిదని ఆలోచించాను. లలిత విషయం కాదు. ఆ గాయం ఇప్పటికి దాదాపు మానింది. అదీ కాక ప్రేమలో కలిగే డిసప్పాయింట్‌మెంట్‌ను రుచి చూసేందుకు ఇది మొదటిసారి మాత్రం కాదు. ఇంతకు క్రితం లలిత లాటి కన్యల మీద ఆశ పెట్టుకోవటం, వారందరూ నన్ను లెక్క చెయ్యకుండానే అత్తవా రిళ్ళకు జారుకోవటం కనీసం డజనుసార్లన్నా జరిగింది. అదీ కాక ఐపోయిన సంఘటనల్ని గూర్చి విచారపడటం కన్న ముందు జీవితంలోని ఆశల మీద బతకట మంటే ఏమిటో నాకు అర్థంకాక పోలేదు.

పోతే– యీ మధ్య సీత కనిపించటం లేదు. నేను లలిత ప్రేమకు శాశ్వతంగా నీళ్ళధార వొదులు కున్నట్లే– సీత నా ప్రేమక్కూడా నీళ్లధార వొదిలిందా? ఈ అభిప్రాయం కలిగి నప్పుడు నేను నిజంగానే ఎంతగానో బాధపడ్డాను. నా గురే తప్పిపోయిందన్న మాట! నాలాటి నవ యువకుడి ప్రేమను వొదులుకునేందుకు – అందులోనూ చాలా రోజులుగా నా వెంట పడ్డట్టు సూచించిన యువతి!– ఆమెకు ఎన్ని గుండె లుండాలి! నా దృష్టి ఎలా వుందంటే ఆమె జీవితాంతం వరకూ నా మీద మనసుంచి– ఒక వేళ ఆమెకు పెళ్లై కాపరానికి వెళ్ళినా – ఆ భర్తతో ఒక వేశ్యవలె వ్యభిచరిస్తూ లోలోన కుళ్లుతూ బాధపడాలని! కాని ఆమె వ్యవహారం చూస్తే ఆమె ఇప్పుడే తన దృష్టిని మార్చుకుందని తోస్తుంది. నా భార్య ఊళ్ళో లేక పోవటంవల్ల ఆమెకు మా ఇంటికి రావలసిన కారణం ఏమీ లేకపోవటంవల్ల ఇదివరకంత తరుచుగా కనిపించటం లేదని కాదు. కాని, నేను కనిపిస్తే దీనంగా, జాలిగా, బాధగా, నావైపే చూస్తూ కన్నీళ్ళొక్కటే తక్కువగా ముఖం పెట్టేది... అలాటి సీత యీనాడు పొరపాటున ఎదురైతే నన్ను లెక్క చేయనట్టు వేరొక దిక్కుకు చూడటం నా సుగుణాలన్నిటికీ గొడ్డలి పెట్టల్లేవుంది!

ఐతే ఒక్క సీత వ్యవహారమే నాకు మనశ్శాంతి లేకుండా చేసిందా? సీత లాటి స్త్రీలను నే నెప్పుడూ లెక్కచేయను. నేను లెక్క చేయని వాళ్లలెక్క నా కనవసరం.

కాని అసలు కారణం అదేదీకాదు. నాలుగేళ్లుగా భార్యతో కాపరం చేస్తున్నాను. ప్రతిరాత్రీ ఇద్దరమూ ఒక్క పక్క మీద పడుకునేవాళ్లం. మానవ శరీరోష్ణం దాదాపు 100 డిగ్రీలు – ఆమె శరీరోష్ణంకూడా నాకు తగులుతూండేది. దాదాపు 200 డిగ్రీల ఉష్ణంలో నిద్రపొయ్యే జీవి 100 డిగ్రీల ఉష్ణంలోనే నిద్రించాల్సి వొచ్చింది. మానవుడు అలవాట్లకు లొంగిపొయ్యే జీవి!

ఇక్కడే ప్రేమకూ కామానికీ గొప్ప యుద్ధం జరుగుతుంది. ఫలితం కూడా ఊహకు దూరమైంది కాదు. కామం గెలిచి తీరుతుంది. ఎందుకనంటే ప్రేమకు పునాదే కామం. కామించకుంటే జీవితమే లేదు! ఆ ముడిసరుకును నానా అవస్థలూపడి ప్రేమగా మార్చవలసి వుంది. ఐతే కామాన్ని కామంగా కాకుండా, ప్రేమగా చూచుకోవటంలో ఒక రకం తృప్తి, ఒక గొప్పతనం ఉందనే మన ఊహ నిజాన్ని మరుగుపరిచి ఒక స్వప్న సీమలోకి లాక్కుపోతుంది. అదే మానవుడు అనుభవించగల సౌఖ్యమని నా నమ్మకం!

నాగరికతను సేవిస్తున్నా నాలాటి ప్రాణి ఒక్క సారిగా ముడి సరుకు కామానికి దిగటమంటే ప్రాణంతకంగానే వుంది. కాని రోజు రోజుకు నా అభిరుచి మెట్టు మెట్టుగా దిగజార నారంభించింది. ఏ మెట్టు దగ్గరైతే అది నెరవేరుతుందో అక్కడే ఆగుతుంది. అంతకన్న కిందికి పోనందుకు సంతోషించవలసి వుంటుంది.

ఈ పరిస్థితుల్లో నా మనశ్శాంతికి ఒక్కటే మందు! నా భార్య నాకు కలిగించే తృప్తి ఒక్కటే లోపించింది. అది పూర్తయితే సరి.

కాని చెడుతిరుగుళ్ళు తిరగటానికి నాకు భయం. ఈ సమాజమే కాదు- ముఖ పరిచయం కూడా లేని మనుషుల్తో, కొత్త ప్రదేశాల్లో రాత్రులు గడపటంలో ఎన్నో అవాంతరాలున్నవి. ఇంటికి కాపలా లేకుంటే దొంగలకు ఒక గొప్ప అవకాశాన్ని యివ్వవలసి ఉంటుంది. అదీకాక - కావలసింది కామమే ఐనా దాన్ని కరెన్సీ నోట్లతో కొనుక్కోవటం నాకు ఇష్టం లేదు. అంతకన్న అరమరిక లేకుండా చెప్పాలంటే- జీవితావసరాలకే చాలని జీతంతో కామంకూడా ఎంతో ఎక్కువ ధరలకు కొనటం, నాకు మించిన విషయం.

కనుక నా అవసరం తీరాలంటే - డబ్బూదుబ్బూ ఖర్చు కాకుండా, మనసు భయానికి లోబడకుండా ఉండేటట్టుగా చూచుకోవాలి. ఈ పరిస్థితుల్లో చప్పున సీత జ్ఞాపకానికి వొచ్చింది. సీత నాయీ అవసరాన్ని నేను కోరిన విధానంలో తీర్చగలదు! సందేహం లేదు.

ఆమెను నేనిన్నాళ్ళూ ఏవగించుకొనే వాణ్ని. ఇప్పుడు ఆమె మీద ఒక రకం మమకారం కలగనారంభించింది. అసలు ద్వేషించబడే మనుషులక్కూడా, ప్రేమించబడే మనుషులకు మల్లేనే మానవ హృదయంలో ఒక స్థానం వుండి తీరాలి. ఇంతా ఏడుస్తే ఆమె జీవితంలో నాకు చేసిన అపకారం అంత గొప్పదేమీ కాదు. లలితకూ ఆమెకూ స్నేహం కనుక ఆమెతో ఉండేది. నిజానికి సీతకు తను నాకు హాని చేస్తున్నాననే ఊహే వుండి వుండకపోవచ్చు. అదంతా అలా వుంచి- ఆ జరిగిపోయిన గాథను అవతలపెట్టి విశాల దృక్పథంతో చూస్తే సీత నన్ను ప్రేమిస్తోంది. అలాటి సీతను దూరంగా నెట్టెయ్యటం నా మౌఢ్యాన్నే నిరూపిస్తుంది. సీతను లోబరుచుకుంటే -

నేను ఒక్క కామాన్ని మాత్రమే ఆరాధించే వ్యక్తినవను, ప్రేమారాధకుణ్ణి అవుతాను. నా అభిరుచి కూడా నేను అనుకున్నంత కిందికి పోవలసిన అవసరం ఉండదు.

నా ఊహలన్నీ సక్రమంగానే వున్నవి. సీత నన్ను లెక్క చేయటం లేదంటే దానికి ఒక్కటే కారణం... నేనామెకూ, ఆమె ప్రేమకూ ఏవిధమైన అవకాశాన్ని యివ్వలేదు... అందుకే ఆమె నిరాశచేసుకొని– 'పుల్ల ద్రాక్షల' సామెతకు దిగివుంటుంది. అందుకని ఆమెను ఉత్సాహపరుస్తే మళ్ళీ ఆమె నా వెంటపడక తప్పదు. అలా తిరిగి ఆమె వెంట పడ్డా పడకపోయినా – నాకు మాత్రం ఆమె వెంటపడక తప్పదు... అవసరం నాది కనుక!

మర్నాటినుంచీ నా వేట ప్రారంభించాను. ఆమె దృష్టిని ఆకర్షించ గలిగే ఎత్తులన్నిటినీ ఆచరణలో పెట్టాను... కాని ఆశ్చర్యం! ఆమె మునుపటి సీతగా నాకు తోచలేదు. ఇంకా దూరదూరానికి జరగసాగింది. నేను యెంత వెంటపడ్డా ఆమె నన్ను లెక్క చేసే స్థితిలో లేదని గ్రహించేందుకు నాకు యెక్కువ రోజులు పట్టలేదు. నేను నా మౌఢ్యాన్ని నమ్మి నా పట్టుదలతో యెంత దూరం వెళ్లానంటే – చివరకు ఆమె యెదుట ఒక ఫూల్‌నైపొయ్యాను. సీత దగ్గర నాకీ అవమానం, శృంగభంగం జరుగుతుందని, కలలోకూడా అనుకోలేదు.

మానవ మనస్తత్వాన్ని ఆధారంగా చేసుకొని నా అనుభవాన్నీ, లోక జ్ఞానాన్నీ, విజ్ఞానాన్నీ నమ్మి నేను యింత దూరం వొచ్చాను. ఆమె ఫోర్తుఫారం రెండేళ్లు వరసాగ్గా తప్పిన పిల్ల – అనాకారి. మానవ మనస్తత్వమంటే ఏమిటో కూడా తెలియని స్త్రీ నన్నెలా ఓడించ గలిగిందో నాకు అర్థం కావటం లేదు. లలిత ముందు ఓడిపొయ్యేందుక్కూడా ఈమే కారణం. ఆ వోటమికి నేనింత కుంగిపోలేదు, యెందుకంటే – నాలాగు ఓడిపోయి బాధపడ్డ యువకులు అర డజనుకు తక్కువలేకుండా మా వీధిలోనే వున్నారు. కాని ఏ యువకుడూ సీత జోలికి రాడు– అలాటి సీతను ఆకర్షించలేక పోయాను... ఆమె దగ్గర వోటమిని ఎదుర్కొన్నానంటే – ప్రస్తుతం మా వూళ్ళోవున్న యువతులందరిముందూ (నా భార్య తప్ప!) వోడినట్లే!

దీనికి కారణ మేమిటి? నా వెంటబడ్డప్పుడు ఆమె మనస్తత్వం ఏమిటి? అది ఇప్పుడెందుకు మారింది? నా జీవితంలో ఒక్క రాత్రన్నా సీతను అనుభవించలేనా? ఒక్క రాత్రి చాలు– నేను వోడిపోలేదనే బాధ నాకు తప్పుతే చాలు. ఏ సమస్యనైతే తీర్చుకుందామనే ఆశతో బయలుదేరానో – అది మరో కొత్త సమస్య నాకు అంట గట్టింది.

సీత కాపరానిక్కూడా వెళ్లింది. పుట్టింటికి వొచ్చి నప్పుడల్లా నన్ను చూచి వెక్కిరింతగా, కొంటెగా నవ్వుతుంది. ఆ నవ్వుకు అర్థం ఏమిటో నాకు ఇంతవరకూ తెలియ లేదు. అసలు అర్థమే లేదా?

ఐతే నేను మాత్రం సీత కోసం ప్రయత్నించటం మానలేదు. ఒక పక్క నిరాశ నాలో లేక పోలేదుగానీ, జీవితంలో ఏ క్షణాన్నైనా ఆమె నాకు లొంగదా; ఒక్కసారి కూడా?

దూరపాలోచన మీద ఒక్కటి తేల్చుకున్నాను. ఆమెను లెక్క చేసే యువకులే లేరు. అలాటిది కాలం, ఖర్మం కలిసొచ్చి నేనొక్కణ్ణే అలా తయారయ్యాను. నాకు లొంగిందంటే - యీ ఒక్క అభిమానినీ పొదులుకున్నట్లే! తనకు కూడా ఒక ప్రేమారాధకుడు ఉన్నాడని ఆమె అనుభవించే తృప్తి మరి ఉండదు. అందుకని ఆమె నాకు లొంగదు.

ఇంతదూరం ఆమె ఎలా ఆలోచించి వుంటుందో - నా మానవ పరిజ్ఞానానికి అందని విషయమే!

ఇంత దూరమూ ముందుకు సాగాక, అది తీరని మరో కొత్త సమస్యను నాకు తగిలించింది. సీత చాలా గొప్పది. నే నామెను ఏమో అనుకున్నాను. ఆమె జీవితాంతం వరకూ తను గొప్పగా, అభిమానంతో తనను ఆరాధించే నన్ను సంపాయించుకో గలిగింది. సీతను ద్వేషించేందుకు బదులు, ఆరాధించే వ్యక్తిగా మారాను. యీ 'మార్పు'కు మళ్ళీ 'మార్పు' ఇప్పట్లో కలుగుతుందనే నమ్మకం మాత్రం నాకు లేదు!

*- నవంబర్ 1948*